విస్తీర్ణం ఫుల్.. వసతులు నిల్

- పెరుగుతున్న పట్టణ విస్తీర్ణం
- పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న లే-అవుట్‌లు
- కానరాని కనీస సౌకర్యాలు
- కొరవడిన ముందుచూపు


పసలపూడి శివారు ప్రాంతంలో వేసిన లే అవుట్లలో అభివృద్ధికి నోచుకోని రోడ్లు

రామచంద్రపురం: మున్సిపాలిటీని ఆనుకుని ఉన్న గ్రామ, పట్టణ శివార్లు ఏకమవుతున్నాయి. దీంతో రామచంద్రపురం పట్టణ విస్తీర్ణం రోజురోజుకూ పెరుగుతోంది. పట్టణ విస్తీర్ణం పెరుగుతున్నా దానికి అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయటంలో ముందుచూపు కొరవడింది. విద్యా, వైద్యం తదితర రంగాల్లో వస్తున్న మార్పుల నేపథ్యంలో పురపాలక సంఘ పరిధి ఏటా విస్తరిస్తోంది. పట్టణానికి అనుకుని ఉన్న గ్రామాల వైపు గృహాలు విస్తరిస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు లేకపోవటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

అరకొర వసతులతో..

పట్టణ శివారు ప్రాంతాల్లో రోజుకో లే-అవుట్ చొప్పన పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. పురపాలక నిబంధనల ప్రకారం రోడ్లు, డ్రైన్లు, విద్యుత్ లాంటి సౌకర్యాలు కల్పించాల్సి ఉన్నా వాటిని నామమాత్రంగానే చూపించి అధికారుల కళ్లు కప్పుతున్నారు. దీంతో లే-అవుట్‌లకు పర్మిషన్లు తెచ్చుకుని యథేచ్ఛగా స్థలాలను విక్రయిస్తున్నారు. ఆయా స్థలాల్లో మౌలిక సదుపాయాలు కల్పనలో చేతులెత్తేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతం అభివృద్ధికి దూరంగానే ఉంటోంది. ప్రజల వద్ద నుంచి అధిక రేట్లకు లే-అవుట్ స్థలాలను విక్రయిస్తున్నా.. డ్రైనేజీ అవుట్ లెట్‌లను ఏర్పాటు చేయటం లేదు. దీంతో ఆయా లే-అవుట్‌లో మురుగు నీరు పారేందుకు మార్గాలు లేక భవిష్యత్‌లో ఇబ్బందులను ఎదుర్కొనాల్సిన పరిస్థితులు ఏర్పడతాయి.

ప్రణాళికలు మృగ్యం

గతంలో పట్టణ విస్తీర్ణం 13.2 చదరపు కిలోమీటర్లు ఉండేది. గత పదేళ్లగా పట్టణ విస్తీర్ణం విపరీతంగా పెరుగుతూ వచ్చింది. పట్టణ శివారు ప్రాంతాలైన ముచ్చిమిల్లి, వీఎస్ఎం కళాశాల ప్రాంతం, పసలపూడి రోడ్డు, బైపాస్ రోడ్డు, ద్రాక్షారామ రోడ్డు, శీలంవారిసావరం -యనమదల, వెల్ల రోడ్డు, తోటవారి వీధి, ఆర్టీసీ కాంప్లెక్స్ తదితర ప్రాంతాల్లో కొత్తగా లే-అవుట్‌లు అభివృద్ధి చేశారు. ఇటీవల వీఎస్ఎం కళాశాల ఎదురుగా, బైపాస్ రోడ్డులో లే-అవుట్లు పెరిగి గృహనిర్మాణాలు జోరందుకున్నాయి. దీంతో దాదాపుగా పది చదరపు కిలోమీటర్లు మేర పట్టణ విస్తీర్ణం పెరిగింది. విస్తీర్ణానికి అనుగుణంగా సౌకర్యాలు మాత్రం పెరగటం లేదు. రోడ్లు, డ్రైనేజీలకు అవుట్ లెట్లు ఏర్పాటు చేయటంలో ముందస్తు ప్రణాళికలు లేకుండా పోయాయి.

సదుపాయాల కల్పన ఎప్పుడో..?

రామచంద్రపురం మున్సిపాలిటీ ఆవిర్భావం నుంచి 27 వార్డులుగానే ఉంది. విస్తీర్ణం పెరుగుతున్నా వాటి స్వభావం మాత్రం అలాగే ఉంది. తాజాగా పట్టణ పరిసర ప్రాంతాల్లో అధికారికంగా ఐదు లే- అవుట్లకు పైగా వెలశాయి. పట్టణానికి ఆనుకుని ఉన్న పసలపూడి పంచాయతీ పరిధిలో కూడా కుప్పలు తెప్పలుగా లే-అవుట్లు వస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న వార్డుల్లో ప్రస్తుతం 1955 వీధిలైట్లు ఉన్నాయి. కాని వాటి సంఖ్య పెంచాల్సి ఉంది. గత ప్రభుత్వంలో మున్సిపాలిటీ వీధిలైట్లను ఎల్ఈడీలుగా మార్చారు. అయితే పెరిగిన పట్టణ విస్తీర్ణంతో వీధిలైట్ల సంఖ్య పెంచాల్సిన అవసరం ఉంది. పట్టణంలో గత జనాభా లెక్కల ప్రకారం 43,683 మంది జనాభా ఉండగా 12,500 కుటుంబాలు ఉన్నాయి. ప్రస్తుతం మరో 5 వేలకు పైగా కుటుంబాలు పెరిగినట్లు అంచనా. వీరికి సరిపడా తాగునీటి సౌకర్యం లేదు. ఇప్పటికే పట్టణంలో సుమారుగా 9 వార్డులకు పైగా తాగునీటి సౌకర్యం లేదు. పట్టణంలో మురికివాడలతో పాటుగా ఇతర ప్రాంతాల్లో 385 చేతి పంపులున్నాయి. పట్టణాభివృద్ధి కోసం ప్రణాళికాబద్ధంగా శివారు ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

పట్టణ సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు



పట్టణంలోని అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. వీధి దీపాలతో పాటు తాగునీటి పైప్‌లైన్ల ఏర్పాటు, రోడ్లు, డ్రైన్ల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నాం. పట్టణ శివార్లలో వస్తున్న లే-అవుట్లలో కనీస సౌకర్యాలు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటాం.

– గాధంశెట్టి శ్రీదేవి, మున్సిపల్ చైర్ పర్సన్

గ్రామాల్లో అన్నసమారాధనలు

కాజులూరు: గణపతి నవరాత్రులు ముగియడంతో మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం అన్నసమారాధనలు నిర్వహించారు. గొల్లపాలెం శివారు చీకట్లవారిపేట, ఊడావారిపేట గణపతి ఆలయాల వద్ద ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో అన్నసమారధనలు నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన సుమారు మూడు వేల మంది భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు.

నీటి సంరక్షణపై అవగాహన ర్యాలీ


హసన్‌బాదలో ప్లకార్డులతో ర్యాలీ చేస్తున్న సర్పంచ్ సతీష్‌రావు తదితరులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని హసన్‌బాదలో ఆదివారం నీటి సంరక్షణ, ప్లాస్టిక్ వాడకం నిషేధంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు ఆధ్వర్యంలో సేవ్ వాటర్, సేవ్ ఎనర్జీ, ప్లాస్టిక్ వాడకం నిషేధించాలని ప్లకార్డులు పట్టుకుని ర్యాలీ చేస్తూ నినాదాలు చేశారు. పారిశుధ్య కార్మికులు గ్రామంలో నీటి గుంటలను గుర్తించి మురికి నీరు తొలగించారు. వైద్య ఆరగ్య సిబ్బంది ఆధ్వర్యంలో కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు అందజేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

25న 'చెకుముకి' పాఠశాల స్థాయి సంబరాలు

కపిలేశ్వరపురం: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 25న పాఠశాల స్థాయిలో ×చెకుముకి₹ సైన్స్ సంబరాలు నిర్వహించనున్నట్టు వేదిక అధ్యక్ష, కార్యదర్శులు వాసంశెట్టి శ్రీనివాస్, పెద్దింశెట్టి లెనిన్‌బాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 8, 9,10 తరగతుల విద్యార్థులు విజ్ఞాన ప్రతిభా ప్రదర్శనలో పాల్గొన వచ్చన్నారు. పాఠశాల స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు అక్టోబర్ 1న మండల, 27న, నవంబర్ 9, 10లలతో రాష్ట్ర స్థాయిలో సంబరాల్లో పాల్గొనే అవకాశాన్ని అందిపుచ్చుకుంటారన్నారు. మానవ సమాజ ప్రగతిని కాంక్షిస్తూ విద్యార్థులు చెకుముకి సైన్స్ సంబరాల్లో పాల్గొనాలని శ్రీనివాస్, లెనిన్‌బాబు కోరారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన అవసరం


పడమర ఖండ్రికలో ర్యాలీ చేస్తున్న చిన్నారులు

కపిలేశ్వరపురం: ప్రతి ఒక్కరికీ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన అవసరమని పడమర ఖండ్రికలో ఆదివారం నిర్వహించిన స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలన్నారు. సామాజిక కార్యకర్తలు, విద్యార్థులు, సచివాలయ ఉద్యోగులు గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సేవ్ ఎనర్జీ, సేవ్ వాటర్, ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి హానికరం అంటూ విద్యార్థులు నినదించారు. వైద్య ఆరోగ్య కార్యకర్తలు అపరిశుభ్ర పరిస్థితులను, ఆరోగ్యాన్ని దెబ్బతీసే పద్ధతులను వివరించారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కృషి

కపిలేశ్వరపురం: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్ అన్నారు. స్థానిక గ్రామ సచివాలయం వద్ద ఆదివారం ఇది మంచి ప్రభుత్వం పేరుతో కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వంద రోజుల కూటమి ప్రభుత్వ పాలనను వివరించారు. ఎంపీ హరీష్ మాట్లాడుతూ పంచాయతీలకు నిధులను మంజూరు చేస్తూ అభివృద్ధిపై దృష్టిసారిస్తున్నామన్నారు. వంద రోజుల్లో అమలు చేసిన పథకాల వివరాలతో కూడిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శాకా శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ నెక్కంటి శ్రీరాంజీ, టీడీపీ అమలాపురం నియోజకవర్గ అధికార ప్రతినిధి పుత్సల శ్రీనివాస్, ఏఎంసీ మాజీ చైర్మన్ పువ్వల చిట్టిబాబు పాల్గొన్నారు.

రూ.16,500 పలికిన వినాయక లడ్డూ


వేలంలో దక్కించుకున్న లడ్డూను కృష్ణకు అందజేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

కాజులూరు: మండలంలోని గొల్లపాలెం శివారు చీకట్లవారిపేట లక్ష్మీగణపతి ఆలయంలో స్వామివారికి స్థానిక భక్తులు 16 కేజీల లడ్డూను సమర్పించారు. గణపతి నవరాత్రులు ముగియడంతో ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం లడ్డూకు బహిరంగ వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన కోడి కృష్ణ రూ.16,500 హెచ్చు ధర చెల్లించి లడ్డూ దక్కించుకున్నారు. ఉత్సమ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పండితులు ప్రత్యేక పూజలు చేసి కృష్ణకు లడ్డూను అందజేశారు.

నేడు సర్వారాయ పాఠశాలల వార్షికోత్సవం

కపిలేశ్వరపురం: కేంద్ర మాజీ సహాయ మంత్రి, సర్వారాయ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకుడు ఎస్‌బీపీబీకే సత్యనారాయణరావు జయంతి, స్థానిక సర్వారాయ హరికథా, వేద పాఠశాల 52వ వార్షికోత్సవాన్ని సోమవారం నిర్వహించనున్నట్టు ఆయా పాఠశాలల కరస్పాండెంట్ ఎస్ఎస్ఆర్ మూర్తి, ప్రిన్సిపాళ్లు అంగర శింగరాచార్యులు, తంగిరాల దత్తాత్రేయశర్మ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వేద పాఠశాల విద్యార్థులచే వేద స్వస్తి, హరికథా పాఠశాల విద్యార్థినులచే సాంస్కృతిక ప్రదర్శనలతో వార్షికోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్ట్

అయినవిల్లి: మండలంలోని ముక్తేశ్వరం-కోటిపల్లిరేవులో పేకాట ఆడుతున్న ఐదుగురిని ఎస్ఐ కె.మనోహర జోషి ఆదివారం రాత్రి అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అజ్ఞాత వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఆదివారం రాత్రి ముక్తేశ్వరం-కోటిపల్లిరేవులోని పేకాట శిబిరంపై దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.4,050 స్వాధీనం చేసుకున్నారు. నిందితులను సోమవారం కోర్టుకు తరలించనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పూడుకుపోయిన బోదె.. బీటలు తీస్తున్న వరి చేలు


బీటలు వారిన నల్లూరు వరిపొలం


పూడుకుపోయిన పంట బోదె

కపిలేశ్వరపురం: వరి సాగుకు సాగునీరే ఆధారం. దమ్ము దశ నుంచి కోతలు పూర్తయ్యే వరకూ వివిధ స్థాయిల్లో నీటిని సకాలంలో అందించాల్సిన అవసరం ఉంది. నీరు అందని వరి పొలాలు బీటలు వారి దిగుబడిపై తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. అదే జరుగుతుంది, కపిలేశ్వరపురం మండలం నల్లూరులోని వరి ఆయకట్టుకు. గ్రామంలోని గరువు పొలాలకు నీరు అందడం లేదని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకూ తరచూ కురుస్తున్న వర్షాలు వల్ల గట్టెక్కామని, ఇప్పుడు పంట బోదెలు ద్వారా నీరు అందడం లేదంటున్నారు. చేనుకు నీరు అందకపోవడంతో వరి చేలు బీటలు వారాయని, ఇదే పరిస్థితి మరికొద్ది రోజులు కొనసాగితే పంట దెబ్బతింటుందని రైతు శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీరు పారే బోదెలు పూడుకుపోవడంతో సమస్య తీవ్రమవుతుందన్నారు. త్వరితగతిన బోదెల్లో చెత్తను తొలగించి నీరును సరఫరా చేయాలని సంబంధిత అధికారులను కోరారు.

24 నుంచి 'పొలం పిలుస్తోంది'

రాయవరం: వ్యవసాయశాఖ ద్వారా ఈ నెల 24 నుంచి పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు మండల వ్యవసాయాధికారి కొప్పిశెట్టి ప్రభాకర్ ఆదివారం తెలిపారు. వారంలో రెండు రోజుల పాటు రోజుకు రెండు గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ నెల 24 ఉదయం రాయవరం, మధ్యాహ్నం వి.సావరం, 25 ఉదయం లొల్ల, మధ్యాహ్నం సోమేశ్వరం గ్రామాల్లో నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు. మారుతున్న ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానం, నూతన సాంకేతిక పద్ధతలను రైతులకు క్షేత్ర స్థాయిలో అందజేస్తామన్నారు. అలాగే పంటలను చీడ పీడల బారి నుంచి కాపాడేందుకు రైతులకు సూచనలు, సలహాలు అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

బాధితుని వైద్యానికి అమ్మ ఫౌండేషన్ సాయం


కిరణ్, నీలిమ దంపతులకు రూ.35 వేలు అందిస్తున్న అమ్మ ఫౌండేషన్ ప్రతినిధులు

మండపేట: పట్టణానికి చెందిన చింత కిరణ్‌కుమార్ అనే వ్యక్తి మూడేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడగా, అతడి భార్య నీలిమ ఉన్న ఇంటిని రూ.10 లక్షలకు అమ్మి భర్తకు వైద్యం చేయించింది. మూడేళ్ల తర్వాత కిరణ్‌కుమార్‌కు పాత గాయం తిరగ బెట్టడంతో అతడి కంటికి, బ్రెయిన్‌కు మళ్లీ ఆపరేషన్ అవసరమని ప్రైవేట్ ఆసుపత్రి వైద్యులు తెలిపారు. పేదవారైన ఆ దంపతులిద్దరూ వైద్యానికి దాతల సాయాన్ని అర్థించారు. వారి విజ్ఞప్తికి స్పందించిన మండపేటకు చెందిన అమ్మ ఫౌండేషన్ స్వచ్ఛంద సేవాసంస్థ దాతల నుంచి రూ.35 వేలు సేకరించింది. ఆ మొత్తాన్ని ఆ సంస్థ వ్యవస్థాపకుడు ఇమ్మిడిశెట్టి నాగభూషణం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో ఆ సంస్థ సభ్యులు చెన్నా సుబ్రహ్మణ్య గుప్తా, మోగంటి రామ్‌కుమార్, టీడీపీ నాయకులు కాళ్లకూరి శ్రీనివాస్, చాపల వీరబాబు, బొడ్డపాటి మోషే, జనసేన నాయకుడు శెట్టి రవికుమార్, కుమార్ హార్డ్ వేర్ షాపు నిర్వాహకుడు సంకా కుమార్‌బాబు పాల్గొన్నారు.

గణేశ్ మంటపాల్లో అన్నదానాల సందడి


గొల్లపుంతలో అన్నప్రసాదాలు వడ్డిస్తున్న కమిటీ కుర్రాళ్లు

మండపేట: గణపతి నవరాత్ర మహోత్సవాలు ముగియడంతో ఆదివారం పట్టణంలోని గొల్లపుంత వీధి, ధర్మగుండం చెరువు ఐఎస్ఎన్ లే అవుట్‌లోని శ్రీరామ్‌నగర్‌లలో అన్న సమారాధనలు నిర్వహించారు. గొల్లపుంత వీధిలో 2500 మందికి, శ్రీరామ్ నగర్‌లో 1,500 మందికి అన్నదానం చేసినట్టు నిర్వాహకులు మెండు నాగు, గుణ్ణ శ్రీను తెలిపారు. టిడ్కో కాలనీ, వైఎస్సార్ కాలనీ, పాటిమీద, ధర్మగుండం, మఠం వీధి, నాయుళ్ల గుడి వీధి తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. విందు భోజనాలను తలపించేలా పలురకాల వంటకాలను భక్తులకు ప్రసాదంగా వడ్డించారు. కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు యర్రగుంట అయ్యప్ప, గవర దుర్గాప్రసాద్, మాతిసీడి వెంకటేష్, సత్యవోలు ముఖేష్, రెడ్డి చింతయ్య కాపు, మెండు సతీష్, ఏపుగంటి ప్రకాష్, రెడ్డి దుర్గ, అంగర సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా ప్రధాన రహదారులు


గోతులతో అధ్వానంగా మారిన నరజాడ-అముజూరు రహదారి

కె.గంగవరం: మండలంలోని అముజూరు- నరజాడ రహదారి గోతులతో అధ్వానంగా మారింది. ఈ రహదారి నిర్మించి సుమారు 10 సంవత్సరాలు అవుతోంది. పక్కనే పంట కాలువ ఉండడం వల్ల రోడ్డు కోతకు గురైంది. మరోవైపు సుమారు 4 కిలోమీటర్ల మేర ఉన్న ఈ రహదారిపై ఎక్కడికక్కడ గుంతలు పడి అధ్వాన్నంగా మారింది. కూళ్లమల్లవరం, నరజాడ గ్రామాల ప్రజలు నిత్యం ఈ రహదారి మీదుగానే రాకపోకలు సాగిస్తాయి. రహదారి ఛిద్రం కావడంతో గ్రామం నుంచి వాకతిప్పవెళ్లే బస్సు కూడా రావడం లేదని, దీంతో నానా అవస్థలు పడుతున్నామని ప్రయాణికులు, స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రహదారి మరింత ఛిద్రమైందని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రహదారిని అభివృద్ధి చేయాలి

కాజులూరు: మండలంలోని అయితపూడి రహదారిని అభివృద్ధి పరచాలని గ్రామస్తులు కోరుతున్నారు. తిప్పరాజుపాలెం మీదుగా కాజులూరు, రామచంద్రపురం రహదారి నుంచి సుమారు మూడు కిలోమీటర్లు మేర రోడ్డు పూర్తిగా ఛిద్రమై గోతులమయంగా మారింది. పలుచోట్ల రోడ్డు కోతకు గురికావడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారి పొడవునా పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు పెరిగిపోయి మార్గాన్ని మూసివేస్తున్నాయి. దీంతో రాత్రి సమయాల్లో పాదచారులకు దారికనిపించక ముళ్లు తగులుకుని గాయాలపాలవుతున్నారు. వర్షం కురిస్తే రోడ్డు పలుచోట్ల బురదగా మారి ప్రయాణికులు జారి పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పోరాట యోధునికి రిటైర్డ్ పోస్టల్ ఉద్యోగుల సన్మానం


రవికృష్ణను సత్కరిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

మండపేట: తమ సర్వీసుల క్రమబద్ధీకరణకు అలుపెరగని పోరాటం సాగించిన విశ్రాంత తపాలా ఉద్యోగి వి.రవికృష్ణ (హైదరాబాద్)ను ఆ శాఖ రిటైర్డ్ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. స్థానిక సూర్యా గ్రాండ్ ఫంక్షన్ హాల్లో ఆదివారం జరిగిన రిజర్వుడు ట్రెన్ ఫూల్ విశ్రాంత తపాలా ఉద్యోగుల సమావేశంలో ఆయనను వారు సత్కరించారు. 1981 నుంచి 83 వరకూ రిక్రూట్ అయిన రిజర్వుడు ట్రెన్ ఫూల్ తపాలా ఉద్యోగుల సర్వీసులను కేంద్ర ప్రభుత్వం 1989లో పర్మినెంట్ చేసింది. ఇలాంటి కేటగిరీ ఉద్యోగులు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో 388 మంది ఉన్నారు. ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధం చేసిన కేంద్ర ప్రభుత్వం వారికి రావాల్సిన బెనిఫిట్స్ మాత్రం విడుదల చేయలేదు. దీనిపై వి.రవికృష్ణ సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్, హైకోర్టు, సుప్రీం కోర్టుల వరకూ వెళ్లి అలుపెరగని పోరాటం సాగించారు. ఆయన పోరాటం ఫలితంగా రెండు నెలల క్రితమే సుప్రీం కోర్టు వారికి అనుకూలంగా తీర్పు వచ్చింది. కాగా ఈ లోగానే 388 మంది రిజర్వుడు ట్రెన్ ఫూల్ పోస్టల్ ఉద్యోగులూ రిటైరయ్యారు. రిటైరయ్యాక కూడా తమ హక్కుల కోసం పోరాడి సాధించిన వి.రవికృష్ణను వారు పట్టణంలో ఆదివారం సత్కరించారు. ఎం.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సభకు ఉభయ గోదావరి జిల్లాల నుంచి విశ్రాంత తపాలా ఉద్యోగులు హాజరయ్యారు. కార్యక్రమంలో కృష్ణమోహనరావు, విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు ఎన్.రామలింగేశ్వరరావు, కె. బాలకామేశ్వరి, ఆకుల శ్రీనివాస్, ఎస్. ప్రకాశరావు, ఎస్. సాయిరాం, ఎస్ఎస్‌వీ ప్రసాద్, కె. ఏడుకొండలు, సలాది సత్యనారాయణమూర్తి, ఎల్‌వీ నాగేంద్రబాబు, టపా పుల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఫొటో,వీడియో గ్రాఫర్ల సంఘ నూతన కార్యవర్గం ప్రమాణం


కొలువు తీరిన ఫొటో,వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

మండపేట: మండపేట జోన్ ఫొటో,వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం పట్టణంలోని లయన్స్ క్లబ్ హాల్లో ఘనంగా జరిగింది. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఎమ్మెల్యేలు వేగుళ్ల జోగేశ్వరరావు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పోసిన వీరేంద్రకుమార్ సమక్షంలో నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేసింది. నూతన అధ్యక్షుడిగా గంగుమళ్ల వెంకటేష్, కార్యదర్శిగా సంగుల దొరబాబు, కోశాధికారిగా కాకి దానియేలు, ఉపాధ్యక్షులుగా అల్లాడ శ్రీనివాస్, పీవీవీ సత్యనారాయణ, మాచవరపు శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా గుంటూరు వేంకటేశ్వర్లు (బుజ్జి), సంయుక్త కోశాధికారిగా దుప్పలపూడి వీరభద్రరావు, మీడియా,టెక్నికల్ అడ్వైజర్‌గా బీఎస్‌కేబీఎన్ మల్లేశ్వర్, సభ్యులుగా పావులూరి సురేష్, సత్తి రామకృష్ణారెడ్డి, పాశం త్రిమూర్తులు, తేలు లోవరాజు, నంబుల రాము, తాడాల మణికంఠ, గంటి రాజకుమార్, వాల్లుమ్ సురేష్, కానూరి సురేంద్రలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా తోట త్రిమూర్తులు మాట్లాడుతూ సమాజానికి ఫొటోగ్రాఫర్స్ సేవలు ఎంతో అవసరం అన్నారు. అనంతరం అతిథులను ఫొటోగ్రాఫర్స్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నేతలు వేగుళ్ల పట్టాభిరామయ్యచౌదరి, రెడ్డి రాధాకృష్ణ, ఫొటోగ్రాఫర్స్ యూనియన్ రాష్ట్ర వైస్ చైర్మన్ చక్కా రాంబాబు, జిన్నూరి సాయిబాబా, రాష్ట్ర, జిల్లా, మండల యూనియన్ నాయకులు, చిర్ల వేంకటేశ్వర రెడ్డి (శ్రీనివాస్‌రెడ్డి), కార్యదర్శి విప్పర్తి నాని, కోశాధికారి గుంటూరు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జ్యోతిరావు పూలే విగ్రహావిష్కరణ


నరాలవారిపాలెంలో జ్యోతిరావు పూలే విగ్రహావిష్కరణలో స్థానిక నేతలు

రాయవరం: మండలంలోని వెంటూరు గ్రామంలో జ్యోతిరావు పూలే విగ్రహావిష్కరణ ఆదివారం జరిగింది. స్థానిక నరాలవారిపాలెం శెట్టిబలిజ సంఘ పెద్దలు, దాతల సహకారంతో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. సర్పంచ్ వాసంశెట్టి వెంకట్రావు చేతుల మీదుగా విగ్రహాన్ని ప్రారంభించారు. గ్రామస్తులు, దాతల సహకారంతో రూ.15 వేలతో విగ్రహాన్ని గ్రామంలో ఏర్పాటు చేశారు. విగ్రహావిష్కరణ అనంతరం జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. బలహీన వర్గాల నేతగా పూలే అందించిన సేవలు చిరస్మరణీయమని పలువురు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గుబ్బల సుబ్రహ్మణ్యం, మాజీ సర్పంచ్ వాసంశెట్టి రాధాకృష్ణ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కొప్పిశెట్టి మాధవరావు, మాజీ వైస్ ఎంపీపీ దేవు శ్రీను, శెట్టిబలిజ సంఘ పెద్దలు నరాల వెంకటరమణ, గుత్తుల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

దళిత వైద్యుడిపై దాడి అమానుషం


బొడ్డపాటి సురేష్‌కుమార్

రాయవరం: కాకినాడ రంగరాయ వైద్య కళాశాల్లో దళిత వైద్యుడు ఉమామహేశ్వరరావుపై కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, ఆయన అనుచరులు చేసిన దాడి అమానుషమని వైఎస్సార్ సీపీ ఎస్సీ లీగల్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డపాటి సురేష్‌కుమార్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల దళితులపై దాడులు పెరిగిపోయాయన్నారు. గౌరవప్రదమైన వృత్తిలో ఉన్న డాక్టర్‌ను ఏక వచనంతో సంబోధిస్తూ, బెదిరించడం హేయమైన చర్యగా ఆయన పేర్కొన్నారు. ప్రజాప్రతినిధిగా పది మందికి న్యాయం చేయాల్సిన వ్యక్తే తన అనుచరులతో కలిసి ఈ విధంగా దళిత వైద్యుడిపై దాడి చేయడం సభ్య సమాజం తలదించుకునేలా ఉందన్నారు. ఇది ఒక వైద్యుడిపై జరిగిన దాడిగా పరిగణించడం లేదని, దళిత జాతిపై జరిగిన దాడిగా పరిగణిస్తున్నట్లు అన్నారు. వెంటనే ఎమ్మెల్యే నానాజీతో పాటు, ఆయనపై ప్రత్యక్ష దాడికి దిగిన అనుచరులపై ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి, చట్టపరంగా కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.